క్లుప్తంగా

ఉచిత నేత్ర వైద్యశిబిరం



గుడివాడరూరల్: లయన్స్ క్లబ్ ప్రగతి ఆధ్వర్యంలో గుడివాడలో ఐదు వేల మంది చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు మాదాల సురేష్ పేర్కొన్నారు. స్థానిక ఫాదర్‌బియాంకి ఉన్నత పాఠశాలలో లయన్స్ ప్రగతి ఆధ్వర్యాన గురువారం విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఉయ్యూరు రోటరీ ఐ సెంటర్ వైద్యులు విద్యార్థులకు చికిత్స అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న ఐదు వేల మంది విద్యార్థులు ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు చేయడమే లక్ష్యంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే మూడు వేల మందికి వైద్య చికిత్సలు పూర్తి చేశామన్నారు. అవసరమైన చిన్నారులకు ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కేశవరావు, కోశాధికారి రవికుమార్, డిస్ట్రిక్ క్యాబినెట్ కార్యదర్శి సనకా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జానపద పద్య నాటకానికి మళ్లీ జీవం పోయాలి



గుడివాడరూరల్: అంతరించిపోతున్న జానపద పద్య నాటకానికి మళ్లీ జీవం పోయాలని, ఇలాంటి నాటకాలను నేటి యువతతో పాటు ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పలువురు నాటక ప్రియులు తెలిపారు. స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని కళా ప్రాంగణంలో బుధవారం రాత్రి రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి విజయవాడ సౌజన్యంతో శ్రీరాజరాజేశ్వరి నాట్య మండలి గుడివాడ వారితో బి.నాగలక్ష్మి ఆధ్వర్యంలో బాలనాగమ్మ పద్య నాటకం ప్రదర్శించారు. ఆయా పాత్రల్లో కళాకారులు బి.నాగ లక్ష్మి, బి.వి జయరాణి, ఎస్.కోటేశ్వరి, లోయ రాధాకృష్ణ, బి.శ్రీనివాస్‌నాయుడు, అప్పారావు, ఈగ నాగేశ్వరరావు, బి.రాణి, పులి నాగేశ్వరరావు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

చెరువులా తాడంకి అండర్‌పాస్



పమిడిముక్కల: ఇటీవల కురుస్తున్న వానలకు విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై ఉన్న తాడంకి అండర్‌పాస్ చెరువులా మారింది. అండర్‌పాస్ కింద పెద్ద మొత్తంలో నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సర్వీస్ రోడ్ల నిర్వహణ సరిగా లేకపోవడం, అండర్‌పాస్ వద్ద మురుగునీరు పోయే ఏర్పాట్లు చేయక రోజుల తరబడి నీరు నిలిచి ఉంటుంది. ఈ ప్రాంతంలో రెండుచోట్ల పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాహనచోదకులు వీటిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు, బస్సులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కసుమూరు వెళ్లి హైవేపైకి రావల్సి ఉంటోంది. అండర్‌పాస్ సమస్యను పలుసార్లు కలెక్టర్, నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, వర్షం పడగానే చెరువులా మారుతోందని సర్పంచ్ జంపాన ధనలక్ష్మి తెలిపారు. మురుగునీరు బయటకు పోయే ఏర్పాట్లు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరులకు నివాళి



గుడివాడరూరల్: బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరులకు వామపక్షాల నాయకులు గురువారం నివాళులర్పించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరులకు వామపక్షాల నాయకులు ఆర్సీపీ రెడ్డి, గూడపాటి ప్రకాష్‌బాబుల ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో స్మార్ట్‌మీటర్లు, ట్రూ అప్ చార్జీలపై ప్రజలతో కలసి ఐక్యంగా పోరాడి విద్యుత్ చార్జీలు తగ్గించుకోవాలన్నారు. అమరులైన విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామిల స్ఫూర్తితో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు సీహెచ్ సత్యనారాయణ, వి.సుధాకర్, కొమ్మురు సురేష్, లంకా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహా గణపతిం భజే



కైకలూరులో చవితి వేడుకల్లో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, కుటుంబ సభ్యులు



శ్రీరాంపురంలోని పుల్లలపాడు వద్ద బాలగణపతికి పూజలు చేస్తున్న భక్తులు



విఘ్నేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు



కైకలూరులో కూరగాయలు, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు



విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు, దేవదాయశాఖ అధికారులు

ఘనంగా వాడవాడలా చవితి వేడుకలు

కైకలూరు: మహా గణపతిం భజే అంటూ భక్తజనం విఘ్నాధిపతికి మనసారా పూజలు చేశారు. వినాయక చవితి వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో వాడవాడలా ప్రజలు జరుపుకొన్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది చవితి పందిళ్లు ఎక్కువగా ఏర్పాటు చేశారు. సంతమార్కెట్, వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ వీధిలో జరిగిన చవితి పందిళ్లలో వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరరావు(డీఎన్నార్) కుటుంబ సమేతంగా పూజలు చేశారు. కార్యక్రమాల్లో డీఎన్నార్ కుమారులు దూలం వినయ్, శ్యామ్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు సింగంశెట్టి రాము, నాయకులు సమయం అంజి, తోట మహేష్, కరేటి రాంబాబు, మడక శ్రీను తదితరులు పాల్గొన్నారు. కైకలూరులో కూరగాయలు, పండ్ల వర్తక సంఘం 51వ వార్షిక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆటపాక, గోనెపాడు, వరహాపట్నం, వేమవరప్పాడు, శీతనపల్లి, ఆలపాడు, కలిదిండి, మూలలంక, కోరుకొల్లు తదితర గ్రామాల్లో చవితి పందిళ్లు ఏర్పాటు చేశారు.

వ్యాపారులకు తీవ్ర నష్టం..

వినాయక చవితి సందర్భంగా పూజా సామగ్రి నిమిత్తం వ్యాపారులు పలు రకాల పత్రి, కాయలు, పండ్లను విక్రయించడానికి కైకలూరులో పలు ప్రధాన సెంటర్లలో దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి వర్షం జోరుగా కురవడంతో అతి తక్కువ మంది మాత్రమే కొనుగోలు చేశారు. దీంతో ఈ ఏడాది వర్షం తీవ్ర నష్టాన్ని కలిగించిందని వ్యాపారులు చెప్పారు.

గుడ్లవల్లేరు: వినాయక చవితికి కురిసిన భారీ వర్షాల ప్రభావం వ్యాపారాలపై పడింది. గుడ్లవల్లేరు బస్టాండ్ సెంటర్ ఏటా భక్త జనంతో కిటకిటలాడేది. చవితి పూజకు కావాల్సిన పత్రి, పూలు, పండ్లు కొనుగోలు చేసేందుకు భక్తులు పోటీ పడతారు. కానీ ఎడతెరిపి లేని వర్షం కారణంగా భక్తులు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేక పోయారు. దీంతో వ్యాపారులకు డిమాండ్ తగ్గిపోయి సెంటర్ వెలవెలబోయింది.

పెదపారుపూడి: మండలంలోని వానపాముల గ్రామంలో బీసీ ఏరియాలో వినాయకుని ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అర్చకులకు చితాంబరంస్వామి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వెంట్రప్రగడ, లక్ష్మీ పురంలో విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. మోపర్రులో విగ్రహానికి వైఎస్సార్ సీపీ నేత బోయిన శివయ్య ప్రత్యేక పూజలు చేశారు.

గుడ్లవల్లేరు: కౌతవరంలో చిరంజీవి క్రియేషన్ అధినేత, సినీ నిర్మాత చల్లపల్లి అమరప్రసాద్ చవితి పూజల్లో పాల్గొన్నారు. గుడ్లవల్లేరులోని బాల వినాయక కమిటీ యువకులు వినాయక చవితి వేడుకల్ని వర్షంలో సైతం నిర్వహించి భక్తిని చాటుకున్నారు. యువకులు విద్యుద్దీపాలను పందిళ్లకు ఏర్పాటు చేశారు.

గుడివాడలో..

గుడివాడరూరల్: చవితి ఉత్సవాల తొలిరోజు బుధవారం స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీవిఘ్నేశ్వర స్వామి ఆలయంలో స్వామివారు శ్రీబాలగణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం 11.05గంటలకు వేద పండితులు కపిలవాయి గోపాలశాస్త్రి నవరాత్రి ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి కమిటీ సభ్యులు, దేవాదాయశాఖ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ వర్షాలు కురుస్తున్నా భక్తులకు ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే దేవదాయశాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్ శాయన రాజేష్, ఆలయ ఈవో యార్లగడ్డ వాసులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, రమణమూర్తి, పోతురాజు, వీరమాచినేని శైలజ, విజయలక్ష్మి పాల్గొన్నారు. శ్రీరాంపురం పుల్లలపాడు వద్ద శ్రీబాలగణపతి దేవాలయంలో నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నీలామహల్ రోడ్డు, పెద్దవీధి, పెద ఎరుకపాడు, జగన్నాథపురం, సత్యనారాయణపురం, ఏలూరురోడ్, కాకర్లవీధి,రాజేంద్రనగర్, బైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు నవరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.

మండలంలో..

గుడివాడ మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా నిర్వహించారు. మోటూరు, దొండపాడు, మల్లాయపాలెం, చౌటపల్లి, లింగవరం, రామనపూడి, బిళ్లపాడు, తటివర్రు, సీపూడి, బొమ్ములూరు, సిద్ధాంతం తదితర గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



విఘ్నేశ్వరస్వామి ఆలయంలో శ్రీమహాగణపతిగా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు

భక్తిశ్రద్ధలతో..



పమిడిముక్కల: వినాయకచవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వాడవాడలా పందిళ్లు వేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా వీరంకిలాకు ఏటీఎం సెంటర్‌లో ఏర్పాటుచేసిన మండపం వద్ద శుక్రవారం అన్నసమారాధన చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గ్రామ సభలు పునాదుల వంటివి

మండవల్లి: గ్రామసభలు వార్డు సభ్యులకు పునాదుల వంటివని ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. స్థానిక గ్రంథాలయం వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామసభల్లో ఓటర్లు అందరూ పాల్గొని నిర్ణయాలు చెప్పే స్థితిలో ఉండాలని, ఆయా ప్రాంతాల్లో పనిచేసే ప్రభుత్వాధికారులు జవాబు చెప్పే స్థితిలో ఉండాలని ఆయన పేర్కొన్నారు. జనవరి 2, ఏప్రిల్ 14, జులై 1, అక్టోబర్ 3వ తేదీల్లో 4 సార్లు జరుగుతుందని, ఎప్పుడు అవసరమైతే అప్పుడు గ్రామసభను నిర్వహించుకునే స్వేచ్ఛ గ్రామ పంచాయతీలకు ఉందన్నారు. ప్రజలు కోరితే పంచాయతీలు గ్రామసభను నిర్వహించాల్సి ఉందని పేర్కొన్నారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష వద్దు



ముదినేపల్లి రూరల్: హెచ్ఐవీ బాధితులపై వివక్ష వద్దని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ప్రతినిధులు సీహెచ్ నాగలక్ష్మి, జె. చంద్రావతి అన్నారు. మండలంలోని దాకరంలో హెచ్ఐవీపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. హెచ్ఐవీకి గురి కాకుండా అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దీనిపై ఇంటింటికీ కరపత్రాలు అందజేసి స్థానికులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఎం.జ్యోతి, స్థానిక ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చురుగ్గా డ్రెయినేజీ పనులు



మండవల్లి: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మండవల్లిలో డ్రెయినేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రోడ్డు విస్తరణ పనులు ఏడాదిలోపు పూర్తయ్యే అవకాశం ఉందని సూపర్‌వైజర్ నాగరాజు తెలిపారు.

శిథిలావస్థలో పశువైద్యశాల భవనం



పెచ్చులూడి కనిపిస్తున్న గుడివాడ పశువైద్యశాల

గుడివాడరూరల్: స్థానిక మెయిన్‌రోడ్డులోని చింతలకాల్వను ఆనుకున్న ఉన్న పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరి ఏక్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం తక్షణమే నూతన భవనం ఏర్పాటుకు కృషి చేయాలని భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపక అధ్యక్షుడు వైవీ మురళీకృష్ణ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ మనోహర్, డీఎస్పీ వి.ధీరజ్ వినీల్‌లను గురువారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆస్పత్రి ప్రస్తుతం దయనీయ పరిస్థితుల్లో ఉందని, పిల్లర్లు పగిలిపోయి, భవనం పైకప్పు పెచ్చులూడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వైద్యులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారన్నారు. చాలా మంది పశు పోషకులు ఆ ఆస్పత్రికి పశు వైద్యం కోసం నిత్యం వస్తుంటారన్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా భవనానికి ముప్పు పొంచి ఉందని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆ భవనాన్ని తొలగించి కొత్తది నిర్మించాలని ఆయన కోరారు.

నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

రామవరప్పాడు: సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని, విద్యార్థులు ఎప్పటికప్పుడు మారుతున్న పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని ముఖ్య అతిథి డాక్టర్ పి. సాయి కిరణ్ అన్నారు. ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 'క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్' నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి కిరణ్ మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్ అనేది సంంప్రదాయ కంప్యూటింగ్ కంటే భిన్నంగా, క్వాంటమ్ బిట్స్ ఆధారంగా పని చేసే విప్లవాత్మక సాంకేతికత అన్నారు. ఇది ప్రత్యేకమైన గణనశక్తితో క్లిష్టమైన గణన సమస్యలను వేగంగా పరిష్కరిస్తుందని తెలిపారు. యువత ప్రతిభకు ఇటువంటి అవకాశాలు కల్పించడం ద్వారా మన దేశం గ్లోబల్ టెక్ వేదికపై ముందంజలో ఉంటుందని చెప్పారు. ప్రిన్సిపాల్ ఎం.ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ క్వాంటమ్ కంప్యూటింగ్ హ్యాకథాన్‌ను ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా భావిస్తున్నామన్నారు. హ్యాకథాన్‌లో మొత్తం 12 విద్యార్థి టీమ్‌లు పాల్గొన్నాయి. వీటిలో ఐదు జట్లు తర్వాత స్టేజీకు ఎంపికయ్యాయి.

పరామర్శ

ముదినేపల్లి రూరల్: పెదపాలపర్రుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత మేడేపల్లి సతీష్‌ను వైఎస్సార్ సీపీ నేతలు గురువారం పరామర్శించారు. సతీష్ మాతృమూర్తి వరలక్ష్మి ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోమటి విష్ణువర్ధన్, గంటా సంధ్య, గంటా కోటేశ్వరరావు, మోత్రు ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం



గూడూరు: మండలంలోని నారికేడాలపాలెంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో జన్ను గోపాలరావుకు చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధం అయ్యింది. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో నిరుపేద కుటుంబానికి చెందిన గోపాలరావు కట్టుబట్టలతో మిగిలిలాడు. సమాచారం తెలుసుకున్న బందరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

సత్యహరిశ్చంద్ర విగ్రహావిష్కరణ



సత్యహరిశ్చంద్ర విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కలిదిండి(కైకలూరు): వైఎస్సార్ సీపీ కలిదిండి ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు తండ్రి కోటేశ్వరరావు జ్ఞాపకార్థం కోరుకొల్లు శ్మశానవాటికకు వెళ్లే రహదారిలో ఏర్పాటు చేసిన సత్యహరిశ్చంద్ర విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) గురువారం ఆవిష్కరించారు. అనంతరం కోటేశ్వరరావు ప్రథమ వర్ధంతిలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ముదినేపల్లి, మండవల్లి మండలాల వైఎస్సార్ సీపీ ఎంపీపీలు రామిశెట్టి సత్యనారాయణ, పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు చేబోయిన వీరరాజు, గాదిరాజు మణికిషోర్ వర్మ, తిరుమాని రమేష్, బేతపూడి ఏసేబురాజు, సింగంశెట్టి రాము, చెన్నంశెట్టి సోమేశ్వరరావు, నాగరాజు, కాసులు, పాము రవికుమార్, చాన్ బాషా, గాలిబ్‌బాబు, అంకం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ధర్మ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి



కైకలూరు రామకృష్ణ మందిరంలో కరపత్రాలను విడుదల చేస్తున్న శివస్వామి

కైకలూరు: హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనం సెప్టెంబరు 14వ తేదీ ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగుతుందని, హిందూ న్యాయవాదులు విచ్చేసి విజయవంతం చేయాలని శ్రీశైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి చెప్పారు. కైకలూరు రామకృష్ణ సేవా మందిరంలో గురువారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో దేవస్థానాలు, మఠాలు, పీఠాల ఆస్తులను రక్షించుకోడానికి ఫాం ఫర్ హిందూ లాయర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో 12 మంది పీఠాధిపతులతో హిందూ న్యాయవాదులందరినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి ధర్మసమ్మేళనాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో 150 బార్ అసోషియేషన్ల నుంచి 1500 మందిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మసమ్మేళనం సీమాంధ్ర బాధ్యుడు న్యాయవాది జి.శ్రీకృష్ణకుమార్, స్థానిక న్యాయవాదులు కట్టా శ్రీనివాసరావు, మేడిశెట్టి పాములు, బీజేపీ కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట రామప్రసాద్, రామకృష్ణ సేవా మందిరం నిర్వాహకులు భూపతిరాజు వెంకటేశ్వర వర్మ, రాజరాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆనవాళ్లు లేని 'కోట'

ఆక్రమణలు తొలగించి పూర్వ వైభవం తీసుకురావాలని గ్రామస్తుల వినతి



కానుకొల్లులో అంతరించిపోయిన పురావస్తుశాఖ కోట


మండవల్లి: కానుకొల్లులో స్వాతంత్ర్య సిద్ధికి ముందు చాణిక్య రాజులు నిర్మించిన పురావస్తుశాఖ కోట పూర్తిగా అంతరించి పోయింది. దీన్ని పురావస్తుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించేవారు. గతంలో ఈ కోటను వీక్షించడానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు వచ్చేవారు. ఇది కొన్ని మీటర్ల ఎత్తులో ఉండి, విజయవాడ-భీమవరం నేషనల్ హైవే మీదకు కూడా కన్పించేది. ఇది చుట్టూ చెట్లు, చేమలతో కనుమరుగైంది. 13 ఎకరాల 62 సెంట్ల విస్తీర్ణంలో ఇది ఉండేది. కొందరి ఆక్రమణల కారణంగా పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితికి వచ్చింది. ప్రభుత్వం దీన్ని పురావస్తుశాఖకు అప్పగించింది. 1969లో గెజిట్ పబ్లికేషన్ కూడా జరిగింది. గ్రామస్తులు పురావస్తు శాఖకు చెందిన కోటగా చెబుతున్నారు. కోట ఆక్రమణలపై కొందరు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చారు. రెవెన్యూ, పురావస్తుశాఖ భూమిని ఆక్రమణల బారి నుంచి రక్షించాలని, గతంలో ఉన్న కోటను సంరక్షించాల్సిన బాధ్యత పురావస్తుశాఖ అధికారులకు ఉందని గ్రామస్తులు చెబుతున్నారు.

కోటను పట్టించుకోవడం లేదు

గతంలో అందరికీ ఆహ్లాదం కలిగించే కోట పూర్తిగా అంతరించిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు కోటను చూడటానికి ఎందరో వస్తుండేవారు. ఇది దెబ్బతినడంతో ఏ ఒక్కరూ దీనిని పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనికి గత వైభవం తీసుకురావాలి.

–కె.జానకిరామ్, కానుకొల్లు

చర్యలు తీసుకోవాలి



కోట ఎంతో ఎత్తులో ఉండి సందర్శకులు చూడటానికి చూడముచ్చటగా ఉండేది. దీన్ని చూడటానికి వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చేవారు. రానురానూ దీని ఆనవాళ్లు లేకుండా పోయాయి. గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తెచ్చే ఈ కోటకు పూర్వవైభవం తీసుకురావడానికి పురావస్తుశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బెజవాద ప్రసాద్, కానుకొల్లు

■ భగవద్గీత పారాయణం

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు శ్రీగణపతి సచ్చిదానంద ఆశ్రమంలోని గురుపాదుక మందిరంలో గురువారం భగవద్గీత పారాయణం నిర్వహించారు. గురుదత్తాత్రేయ స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

బాబా ఆలయంలో అన్నసమారాధన

మండవల్లి: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉన్న శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం అన్నసమారాధన జరిగింది. మండవల్లి పరిసర గ్రామాలైన గన్నవరం, పెరికెగూడెం, కొర్లపాడు, అయ్యవారి రుద్రవరం గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య పాల్గొన్నారు.

